వేగవంతమైన కెనాల్ బండ్ పనులు



కెనాల్ బండ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆంధ్రాప్యారిస్ ఖ్యాతిని ప్రతిబింబించేలా చేపడుతున్న తెనాలి కెనాల్‌బండ్ నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. హైదరాబాద్ టాంక్ బండ్ తరహాలో పట్టణ సరిహద్దుల్లో విజయవాడ రహదారివెంట నిజాంపట్నం కాల్వ అంచున ఏర్పాటుచేసే కెనాల్ బండ్‌పై తెనాలి కీర్తిప్రతిష్టలకు కారకులైన మహనీయుల విగ్రహాలను ప్రతిష్ట చేయనున్నారు. అనంతరం అక్కడ సుందరీకరణతో ప్రజలకు సందర్శనీయ స్థలంగా రూపొందిస్తారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మానసపుత్రిక అయిన కెనాల్ బండ్ కు ప్రధానమైన విగ్రహ దిమ్మెలు గ్రానైట్ పలకలతో సహా ఏర్పాటు పూర్తయింది. పనుల పురోగతిని సోమవారం ఎమ్మెల్యే శివకుమార్ మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. అవసరమైన సూచనలు చేశారు. తొలి దశలో వివిధ రంగాల ప్రముఖుల విగ్రహాలను 19 ప్రతిష్ట చేయనున్నట్టు తెలిపారు. వీరితో మున్సిపల్ ఇంజినీరు కె.నాగమల్లేశ్వరరావు, కౌన్సిలరు గుంటూరు కోటేశ్వరరావు ఉన్నారు.

బుర్రిపాలెం గ్రామ సర్పంచ్ బరిలో అయిదుగురు పోటీ

తెనాలిటౌన్: ఈ నెల19న రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామ సర్పంచ్ పదవికి జరుగబోవు ఎన్నికల్లో అయిదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఎల్.విజయాలక్ష్మణ్‌లు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు సోమవారం గడువు ముగియడంతో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారి ప్రకటించి వారికి గుర్తులను కేటాయించారు. సర్పంచ్‌గా చందు శ్రీనివాసరావు, పరుచూరి విజయలక్ష్మి, శాఖమూరి చలపతిరావు, శాఖమూరి రవీంద్రబాబు, శాఖమూరి వేణుగోపాలరావులు పోటీలో ఉన్నారు. వీరికి వరుసగా మంచము, కత్తెర, ఉంగరము, బుట్ట, వంకాయ గుర్తులను కేటాయించినట్లు ఆర్ఓ తెలిపారు. హాఫ్‌పేట గ్రామ మూడోవ వార్డుకు జరిగే ఎన్నికలో కోటిపల్లి నరసింహారావు, వల్లూరి శివానందంలు పోటీలో ఉన్నారని వీరికి ప్రెషర్‌కుక్కర్, గౌను గుర్తులను కేటాయించారు. ఈ నెల 19న ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

















కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వ పథకాలు


కార్మికులతో మాట్లాడుతున్న డాక్టర్ పి.పి.వావ

గుంటూరు మెడికల్: ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకం కార్మికులను ఆదుకునేందుకు ప్రవేశపెట్టారని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావా అన్నారు. సోమవారం గుంటూరు జీజీహెచ్ శుశ్రుత హాలులో పారిశుద్ధ్య కార్మికులతో ఆయన సమీక్ష చేశారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు పైసా ఖర్చు లేకుండా ఆరోగ్య సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కోసం నిధులను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకంలో గ్రూప్ ఇన్సూరెన్స్ పొందిన కార్మికులు ప్రమాదానికి గురై మరణిస్తే రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష ఇస్తారని వెల్లడించారు. జీజీహెచ్‌లో పనిచేసే కార్మికులకు ఐడీ కార్డు ఉందా, ఐడీ కార్డుపై ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించారా లేదా అనే విషయాలను ఆరా తీశారు. ప్రతి కార్మికునికి 15 రోజుల్లోగా గుర్తింపుకార్డు అందజేయాలని ఆదేశించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ఎస్ శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

నెహ్రూనగర్: ఔట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జాతీయ సఫాయి కార్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావకు ది గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య పనివారల సంఘం గౌరవ అధ్యక్షుడు బత్తుల మరియన్న విన్నవించారు. ఈ మేరకు సోమవారం గుంటూరుకు విచ్చేసిన ఆయనకు విజ్ఞాన మందిరం పారిశుద్ధ్య కార్మికులు, కార్మిక సంఘాల నాయకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడుతూ కరోనా సమయంలో సుమారు 300 మందికిపైగా అదనపు పనివారిని విధుల్లోకి తీసుకున్నారని, ఆ తరువాత వారిని విధుల్లోంచి తొలగించారని వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. రమణ, నాగేశ్వరరావు, సాంబశివరావు, రాంబాబు, దుర్గారావు, అచ్చయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి ..

గుంటూరు వెస్ట్: ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా వెలకట్టలేని సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, ఆరోగ్యంపై జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు డాక్టర్ పి.పి.వావ పేర్కొన్నారు. సోమవారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్, జిల్లా అధికారులతో డాక్టర్ పి.పి.వావ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం కార్మికుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. దేశంలో మాన్యువల్ స్కావెంజర్‌ను పూర్తిగా నిషేధిస్తూ 2013లో ప్రాహిబిషన్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ యాజ్ మాన్యువల్ స్కావెంజర్ అండ్ దైర్ రీహాబిలిటేషన్ యాక్ట్ అమలులోకి తీసుకొచ్చారన్నారు. దీన్ని సక్రమంగా అమలు జరిగేలా జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. సఫాయి కర్మచారుల ఉపాధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్ఎస్‌కేఎఫ్‌టీసీ ద్వారా హామీలేని రుణాలు అందిస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా జిల్లాలో అర్హులైన కార్మికులకు ఇంటి స్థలాలు మంజూరు చేయడంతో పాటు, నిర్మాణాలు కూడా చేపట్టామన్నారు. దీంతోపాటు, అర్హులైనందరికి నవరత్న సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ శాఖ అధికారుల తనిఖీలు

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని విలీన గ్రామాల్లో విద్యుత్ నిఘా విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న వినియోగదారులతోపాటు అనుమతి పొందిన లోడ్ కంటే ఎక్కువగా వినియోగించుకుంటున్న పలువురు గృహ, వాణిజ్య, పారిశ్రామిక సర్వీసుల్లో 79 మందిని గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.6,70,300 అపరాధ రుసుం వసూలు చేయాలని నిర్ణయించినట్లు సీఆర్‌డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయ్ కుమార్ తెలిపారు.





నిర్దేశిత గడువులోపు అర్జీలను పరిష్కరించాలి

డెప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్

నెహ్రూనగర్: స్పందనకు అందే ఫిర్యాదులు నిర్దేశిత గడువులోగా పరిష్కారం అయ్యేలా విభాగాధిపతులే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని డెప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జి కమిషనర్ పెద్ది రోజా ఆదేశాల మేరకు డెప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్లను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారిగా జగనన్నకు చెబుదాం అర్జీలకై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 30 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 9, ఇంజినీరింగ్ విభాగానికి 9, రెవెన్యూ విభాగానికి 8, ప్రజారోగ్య విభాగానికి 2, పరిపాలన విభాగానికి 1, ఉపా సెల్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఈఈలు సుందర్రామిరెడ్డి. కొండారెడ్డి, ఏడీహెచ్ రామారావు, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఏసీపీలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఆస్తి గొడవల నేపథ్యంలో ఇంటికి నిప్పు

గుంటూరు ఈస్ట్: ఆస్తి గొడవల నేపథ్యంలో కోడలి ఇంటికి నిప్పుపెట్టిన మామపై పోలీసులు కేసునమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకుమానువారితోటలో నివాసం ఉండే పుష్పకు, ఆమె చిన్నమామ మేకపాటి నరసింహారావుల మధ్య ఆస్తి గొడవలు ఉన్నాయి. ఈనేపథ్యంలో నరసింహారావు ఆదివారం రాత్రి పుష్ప ఇంట్లోకి వెళ్లాడు. పుష్ప వెనుక గదిలో నిద్రిస్తుండగా, ముందు గదిలోని బెడ్‌పై నరసింహారావు పెట్రోలు పెట్టి నిప్పంటించాడు. పొగ వాసనకు నిద్రమేల్కొన్న పుష్ప పక్కింటివారి సహాయంతో మంటలు ఆర్పించారు. పుష్ప ఇంట్లో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నరసింహారావు నిప్పు పెట్టినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నా భూమి - నా దేశం ర్యాలీ



పాత గుంటూరు: అశోక్ నగర్‌లోని డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా సోమవారం నామట్టి, నా దేశం కార్యక్రమం నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరులకు వందనాలు తెలుపుతూ నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులచే త్రివర్ణ పతాకంతో దేశభక్తిని చాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.గోవింద రాజన్ పర్యవేక్షించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

77 శాతం వైద్య పరీక్షల్లో రాయితీ



గుంటూరు మెడికల్: హోప్‌విన్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్పటల్ నిర్వాహకులు, సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ షమసుల్తానా సోమవారం తెలిపారు. స్థానిక గుంటూరువారితోట 7వలైనులోని తమ హాస్పటల్‌లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతోందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అన్ని రకాల వైద్య పరీక్షలు, సంతానసాఫల్య చికిత్సల్లో 77 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. కార్పొరేట్ వైద్య సేవలను సామాన్యులకు చేరువ చేయాలనే లక్ష్యంతో కేవలం రూ. 10తో ఓపీ వైద్య సేవలను అందిస్తున్నామని సీనియర్ ల్యాప్రోస్కోపి సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్ తెలిపారు. ప్రజలకు వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో రూ.6.30 లక్షలు మాయం

పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆర్టీసీ డీఎం మంత్రూ నాయక్

మంగళగిరి: వేసిన తాళం వేసినట్లు ఉన్నా లాకర్‌లో నగదు మాయం ఆర్టీసీ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో రూ.6,30,938 చోరీకి గురైనట్లు ఆర్టీసీ డీఎం మంత్రూ నాయక్ సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక రోజు వచ్చిన ఆదాయాన్ని మరుసటి రోజు బ్యాంకులో జమ చేస్తుంటారు. ఈ నెల 11వ తేదీ శుక్రవారం వచ్చిన ఆదాయాన్ని లాకర్‌లో దాచారు. శని, ఆదివారాలు సెలవులు కావడంతో ఆ రెండు రోజులు వచ్చిన ఆదాయం మొత్తం కలిపి రూ.6,30,938 ఆదివారం రాత్రి లాకర్‌లో దాచారు. సోమవారం ఉదయం కార్యాలయానికి చేరుకున్న డీఎం, అధికారులు లాకర్‌లోని నగదును బ్యాంకులో జమ చేసేందుకు చూడగా నగదు మాయమైనట్లు గుర్తించారు. వేసిన తాళం వేసినట్లే ఉండగా నగదు మాయంపై ఆర్టీసీ వర్గాలు విస్మయ వ్యక్తం చేస్తున్నాయి. విచారణ చేపట్టిన డీఎం సాయంత్రం వరకు నగదు విషయం తేలకపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే ప్రయాణీకుల సౌకర్యార్థం గుంటూరు రైల్వే డివిజన్ మీదుగా పలు రైళ్ల నడుపుతున్నట్లు గుంటూరు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ సోమవారం తెలిపారు. రైలు నంబరు 07169 నరసాపూర్-సికింద్రాబాద్ రైలు ఈనెల 15న గుంటూరు డివిజన్ మీదుగా ప్రయాణిస్తుందని వెల్లడించారు. ఈరైలు నరసాపూర్ స్టేషన్ నుంచి సాయంత్రం 6 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 3.50 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని వెల్లడించారు. 07170 సికింద్రాబాద్ - నరసాపూర్ రైలు ఈనెల 16న గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైలు కేటాయించారు. ఈ రైలు రాత్రి 11.30 గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి నరసాపూర్‌కు ఉదయం 8.35 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈరైలు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకీవీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ మీదుగా ప్రయాణిస్తోందని వెల్లడించారు.

మహిళా పాలిటెక్నిక్ డీ.ఫార్మసీలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో డీ.ఫార్మసీ (డిప్లొమా ఇన్ ఫార్మసీ) కోర్సులో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, దూరవిద్య ఇంటర్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులని పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫోటో, సామాజికవర్గ ధృవీకరణ, టెన్త్, ఇంటర్ మార్కుల జాబితాతో కళాశాలలో నేరుగా సంప్రదించాలని సూచించారు. కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థినులకు హాస్టల్ సదుపాయం కలదని, డీ.ఫార్మసీ పూర్తి చేసిప విద్యార్థినులకు ప్రభుత్వ, ప్రైవేటు ఫార్మసీలలో ఉపాధి అవకాశాలతో పాటు స్వయం ఉపాధిగా మందులు షాపు నిర్వహించుకోవచ్చునని పేర్కొన్నారు. డీ.ఫార్మశీ పూర్తి చేసిన తరువాత ఈ-సెట్ ద్వారా బీ.ఫార్మసీ ద్వితీయ సంవత్సరంలోకి నేరుగా ప్రవేశం లభిస్తుందని, వివరాలకు కళాశాల ఫార్మసీ విభాగాధిపతి డాక్టర్ పి.నిర్మలా దేవిని 9959324563, 9848038769 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.







గుప్తా ఫార్మసీ కాలేజ్‌లో రక్తదాన శిబిరం


శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని ఎస్‌ఆర్‌కె అండ్ కెఎస్‌ఆర్ గుప్తా ఫార్మసీ కాలేజ్‌లో సోమవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో విద్యార్థులు రక్తాన్ని దానం చేశారు. విద్యార్థులకు కాలేజ్ కమిటీ అధ్యక్షుడు నంబూరు కృష్ణమూర్తి, సెక్రటరీ నూకల వేణులు అభినందించారు. కార్యక్రమంలో మేనేజర్ డి.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కె.అనిల్‌కుమార్, హెచ్‌ఓడి విజయకృష్ణ, దుర్గారావు, శ్రీనివాసనాయక్, భారతి, రఘురామ్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతి


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం


తెనాలిరూరల్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ఈ నెల 9వ తేదీన తెనాలి నుంచి బుర్రిపాలెం వెళ్లే రోడ్డులో సుమారు 65 ఏళ్ల వయసున్న వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని వాకింగ్‌కు వెళ్లిన వారు గుర్తించారు. 108కు సమాచారం ఇచ్చి తెనాలి జిల్లా వైద్యశాలకు పంపారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు పంపగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు : 9440796219, 9440796170 నంబర్లలో సంప్రదించాలన్నారు.

భవనంపై నుంచి పడి కూలీ మృతి

గుంటూరు ఈస్ట్: నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్ రెండో అంతస్తు నుంచి కింద పడ్డ కూలీ మృతిచెందిన సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజస్థాన్‌కు చెందిన విజయశేఖర్ (31) దేవాపురం 3వలైనులో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం విజయశేఖర్ ప్రమాదవశాత్తు రెండో అంతస్తు నుంచి లిఫ్ట్ కోసం తవ్విన గుంతలోపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని జీజీహెచ్‌కు తరలించారు.

తరతరాల యమయాతన

- రాజకీయ ఖైదీలకు కఠిన కారాగార శిక్షలు
- నరకం చూపించిన బ్రిటీష్ పోలీసులు
- అయినా ఉక్కుసంకల్పంతో సమరయోధులు ముందుకే
- పిల్లుట్ల హనుమంతరావు ఆత్మకథలో కళ్లకు కట్టినట్టు వర్ణన


పిల్లుట్ల హనుమంతరావు


కన్నెగంటి సూర్యనారాయణమూర్తిచౌదరి

తెనాలి: 'సెంట్రల్ జైలుకు వెళ్లిన మూడోరోజు నాతోపాటు కఠినశిక్ష పొందిన ఐదుగురిని నూనె గానుగ తిప్పటానికి వినియోగించారు. రోజూ ఐదు నువ్వుల బస్తాలు ఇస్తారు. మేం ఐదుగురం భారీగా ఉండే గానుగ దూలాన్ని గిరగిరా తిప్పుతూ ఉండాలి. ఇద్దరు మెడమీద కాడి పెట్టుకుని లాగుతుంటే ముగ్గురు గానుగ దూలాన్ని ముందుకు తోయాలి. ఆ దూలం భూమికి అర్ధగజం కంటే ఎత్తు ఉండకపోవటంచేత ఈ ముగ్గురూ ముందుకు ఒంగి నెట్టాలన్న మాట!'– రాయవెల్లూరు జైలులో రాజకీయ ఖైదీగా అనుభవించిన కఠినశిక్షను స్వాతంత్య్రయోధుడు పిల్లుట్ల హనుమంతరావు తన ఆత్మకథలో కళ్లకు కట్టినట్టు వర్ణించారు. జంతువులకన్నా హీనంగా అనుభవించిన కష్టాలను అందులో గ్రంథస్తం చేశారు. నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛాజీవితానికి అలాంటి గుండెలను పిండేసే గాథలెన్నో కారణం..! ఆ త్యాగధనులు సదాస్మరణీయులు.. ఆత్మకథలోని ముఖ్యాంశాలు ఇవీ..

25ఏళ్ల వయస్సులో ఉద్యమసింహమై..

పిల్లుట్ల హనుమంతరావు కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామస్తుడు. ఇంటర్ చదివాక 16 ఏళ్ల వయసులో స్వాతంత్య్ర సమరంలో పాలుపంచుకున్నాడు. కడప, గుంటూరు, గోదావరి జిల్లాల్లో ప్రచారం చేశాడు. రాయచోటిలో ఉండగా హనుమంతరావును, దారిలో తెనాలికే చెందిన మరో ఉద్యమకారుడు కన్నెగంటి సూర్యనారాయణమూర్తిచౌదరిని బ్రిటిష్ పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరూ అప్పటికి 25 ఏళ్ల యువకులే. వీరిని రాయవెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. బ్రిటిష్ పాలకులు మనదేశంలో మొదటగా ఏర్పాటు చేసిన జైళ్లలో ఇది ఒకటి. పిల్లుట్ల, కన్నెగంటిని రాయవెల్లూరు తరలించారు. అక్కడ వీరు కఠిన కారాగార శిక్ష అనుభవించారు. వీరి జుట్టును గొరిగించి గొలుసులతో బంధించి నానా చిత్రహింసలకు గురిచేశారు. మల,మూత్ర విసర్జనకూ నీళ్లు ఇచ్చేవారు కాదు.. ఇసుకతోనే కానిచ్చేయాలి. వారానికోసారే సామూహిక స్నానం. బావి వద్దకు తీసుకెళ్లి పశువులపై నీళ్లు కొట్టినట్టు కొట్టేవాళ్లు. అంతటి ఘోరంగా రాజకీయ ఖైదీలను బ్రిటిష్ పాలకులు శిక్షించేవారు. వీరితో పారిశ్రామిక యూనిట్లలో బానిసలుగా పనిచేయించేవారు. వ్యవసాయ పనులూ చేయించేవారు. ఎవరైనా జైలు వార్డర్ల ఆదేశాలు ధిక్కరిస్తే శిక్షలు మరింత కఠినంగా ఉండేవి. చితకబాదేవారు. రెండుకాళ్లను బంధించి నడవమనేవారు. నడుస్తుంటే లాఠీలతో బాదేవారు. ఎట్టకేలకు ఖైదీల సామూహిక నిరసనతో బ్రిటిష్ పాలకులు దిగొచ్చి కొన్ని కనీస హక్కులు కల్పించారు. చివరకు అనారోగ్యానికి గురై చావుముఖంలో ఉండగా విడుదలైన హనుమంతరావు తర్వాతికాలంలో న్యాయవాదిగా బాపట్లలో స్థిరపడ్డారు. సంఘ సంస్కరణాలాభిలాషిగా, హోమియో వైద్యునిగా గుర్తింపు పొందారు. 'త్యాగమే ఊపిరిగా.. బాధలే బాటలుగా' శీర్షికతో తన ఆత్మకథను అక్షరబద్ధం చేశారు.

ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలి

ఎమ్మెల్యే శివకుమార్


ప్రమాణ స్వీకారంలో నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: నూతన కమిటీ చైర్మన్, సభ్యులు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలోని శ్రీ సోమేశ్వరస్వామి దేవస్థానానికి నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం శ్రీ సోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, నూనత కమిటీ సభ్యులు దేవస్థానంలో పూజలు నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. దేవస్థాన కమిటీ చైర్మన్‌గా నాగం అరుణకుమారి, సభ్యులుగా కారుమూరు రమాదేవి, దాసరి శాంతి కుమారి, కంపరాజు సిద్ధంరాజు, బొనిగల సురేష్, లింగాల శ్రీను, నీలకంఠ రవిలచేత దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటేశ్వరరావులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యులు చూడాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పిల్లి ఉమాప్రణతి, సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు మైలా భానుప్రసాద్, మాజీ ఎంపీటీసీలు సంకురు బుజ్జిబాబు, సాంబశివరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు తమ్మా శివారెడ్డి, పసుపులేటి శ్రీనివాసరావు, షేక్ ఆదం షఫీ, ఎల్.చినబాబు, మంచాల శ్రీనివాస్, వెంకటసురేష్, శ్రీనివాసరెడ్డి, షేక్ బుజ్జి, ముక్కాల మహేష్, తోట పానకాలు, తన్నీరు శ్రీనివాస్, నాగం శివ, మహమ్మద్ గౌస్, కల్పన, తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతక్రమంలో అభివృద్ధి పనులు


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ప్రాధాన్యతాక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధుల సూచనల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నగర మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని సంపత్ నగర్, రామచంద్రాపురం, పార్వతిపురం, బాబు రాజేంద్ర ప్రసాద్ కాలనీలో పర్యటించి, ఆ ప్రాంతాలలో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనులను స్థానిక పెద్దలు, అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో 2021 సంవత్సరంలో నూతన పాలకవర్గం ఏర్పడ్డాక ప్రజావసరాల దృష్ట్యా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా, సుమారు 200 కోట్లకు పైగా పనులు కుల, మత పార్టీలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గుంటూరు నగరంలోని 20వ డివిజన్ పార్వతిపురం, బాబు రాజేంద్ర ప్రసాద్ కాలనీల్లో తాగు నీటి సమస్య, కరెంట్ లోవోల్టేజ్ సమస్యలు ఉన్నాయని, సమస్యలు శాశ్వతంగా పరిష్కరించేందుకు ఆయా ప్రాంతాలలో ప్రత్యేకంగా వాటర్ ట్యాంక్, పవర్ సబ్ స్టేషన్లను నిర్మిస్తున్నామని తెలిపారు. అంతేకాక ఆ ప్రాంతాలలో సీసీ డ్రెన్లు, రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలలో స్థానికులకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, అభివృద్ధి కార్యక్రమాల నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ కాండ్రకుంట గురవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు సాదు రాజేష్, కంతేటి శ్యాం శేఖర్, ఖాజా మొహిద్దీన్, డీఈఈ రమేష్ బాబు, ఏఈ రాంబాబు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం అజరామరం


జాతీయ జెండాలతో అధ్యాపకులు, విద్యార్థినుల మానవహారం

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ రక్షణలో ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరవీరులను మరువరాదని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల, ఐటీసీ–ఎంఎస్‌కే, షినిష్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కళాశాల నుంచి మార్కెట్ సెంటర్లోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అమర జవానుల స్మారక స్థూపం వద్ద అధ్యాపకులు, విద్యార్థినులు నివాళులర్పించారు. జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ దేశం పట్ల బాధ్యతను కలిగి, దేశాభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ర్యాలీలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు ఎం.సంతోష్‌కుమారి, ధాత్రికుమారి, కేజీ సుబ్బరత్నమ్మ, కె.విజయకుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైద్య సేవలపై కేరళ బృందం సంతృప్తి

గుంటూరు మెడికల్: జిల్లాలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించేందుకు నేషనల్ హెల్త్ మిషన్ ద్వార కేరళ నుంచి వచ్చిన వైద్య బృందం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు తెనాలి జిల్లా ఆసుపత్రి, ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెరికలపూడి సబ్ సెంటర్, కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రం, మంగళగిరి ఇందిరానగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గుంటూరు జీజీహెచ్, వెనిగండ్ల సబ్ సెంటర్లలో ఈ బృందం వైద్య సౌకర్యాలను పరిశీలించింది. కొన్ని సబ్ సెంటర్లకు పక్కా భవనాలు లేవని, పెరికలపూడిలో డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు పరుచుకోవాలని, ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు పెంచాల్సిన అవసరం ఉందని కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. స్పెషాలిటీ డాక్టర్ల సేవలను సద్వినియోగం చేసుకుని కేంద్రం ద్వారా అమలు జరుగుతున్న ఎన్‌ఆర్సీ, డైక్, ఎస్ఎన్సీయూ వైద్య సేవలను ప్రజలు వినియోగించుకునేలా చూడాలని సూచించారు. గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబుతో కేరళ బృందం సభ్యులు డాక్టర్ మాథ్యూస్, డాక్టర్ ఉమెన్ మాథ్యూస్‌లు సోమవారం సమావేశమై వైద్య సేవల గురించి చర్చించారు. సమావేశంలో ఎన్‌హెచ్‌ఎం డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, తెనాలి డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అన్నపూర్ణ, ఏపీడమాలజిస్టు డాక్టర్ వరప్రసాద్, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని పాటించాలి

పాత గుంటూరు: మతసామరస్యాన్ని పాటించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. బ్రాడీపేటలోని సీపీఎం సమావేశ మందిరంలో సోమవారం మతసామరస్య రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో మతసామరస్యం – ఆవశ్యకత అనే సమాలోచన సభ నిర్వహించారు. సభకు వేదిక అధ్యక్షుడు ఈరి రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత న్యాయమూర్తి రత్నకుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ముస్లిం, క్రిస్టియన్ కమ్యూనిటీలు అత్యధికంగా ఉన్న దేశాల్లో చర్చిలు, దేవాలయాలు, మసీదులు నిర్మాణాలకు ఎలాంటి అడ్డంకులు ఉండటం లేదని, మన దేశంలో మాత్రం ఎన్నో అడ్డంకులను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. కార్యక్రమంలో ముస్లిం లీగ్ పార్టీ అధ్యక్షుడు బషీర్ తదితరులు పాల్గొన్నారు.

150 మీటర్ల జెండాతో ఏబీవీపీ తిరంగా ర్యాలీ


150 మీటర్ల పొడవైన జెండాతో విద్యార్థుల ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో 150 మీటర్ల పొడవైన జాతీయ పతాకంతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద జాతీయ జెండాతో కూడిన విద్యార్థుల ప్రదర్శనను నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్య్రం ఎందరో త్యాగధనుల పోరాట ఫలితమన్నారు. విద్యార్థులు, యువతరం నిత్యం వారిని స్మరించుకుంటూ దేశభక్తితో ముందుకు వెళ్లాలని సూచించారు. దేశభక్తిని నింపేందుకు ఏబీవీపీ జాతీయ జెండాతో ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు జాతీయ జెండాతో లాడ్జి సెంటర్ వరకు ప్రదర్శనగా తరలి వెళ్లారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి డి.సాయి చరణ్‌గుప్తా, సంయుక్త కార్యదర్శి ఎస్.చంద్ర, జిల్లా కన్వీనర్ దివాకర్, కార్యకర్తలతో పాటు వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల రిజిస్ట్రేషను పట్టాలను ఇప్పించాలని వినతి


అర్జీలను స్వీకరిస్తున్న గీతాంజలి శర్మ

తెనాలి: జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కోరుతూ తగిన డబ్బులు చెల్లించినా, ఇప్పటికీ రిజిస్ట్రేషను దస్తావేజులు లేదా తమ ఒరిజినల్ పట్టాలను ఇవ్వలేదంటూ రూరల్ మండలం కఠెవరంకు చెందిన పలువురు విజ్ఞప్తి చేశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన సమావేశంలో సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ అర్జీలను స్వీకరించారు. కఠెవరంకు చెందిన ఎస్సీ కాలనీవాసులు తమ సమస్యపై వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన 200 మంది వరకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద నగదు మొత్తం చెల్లించినా, ఇప్పటివరకు ఏ ఒక్కరికీ రిజిస్ట్రేషను చేయించి ఇవ్వలేదని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై విచారించి న్యాయం చేస్తామని సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ చెప్పారు. స్పందన సమావేశంలో మొత్తం ఆరు అర్జీలు వచ్చాయి. విద్యుత్ సమస్యపై ఒకరు, గృహనిర్మాణ అంశంపై మరొకరు అర్జీలను ఇవ్వగా, మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలపై ముగ్గురు వినతిపత్రాలను అందజేశారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సేల్స్‌మ్యాన్ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ చలం

తెనాలిరూరల్: అక్రమంగా మద్యం విక్రయించిన ప్రభుత్వ మద్యం దుకాణ సేల్స్‌మ్యాన్, కొనుగోలు చేసేందుకు వచ్చిన మరో నలుగురిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) అధికారులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ. చలం సోమవారం రాత్రి వివరాలు వెల్లడించారు. తెనాలి మండలం పెదరావూరులోని ప్రభుత్వ మద్యం దుకాణానికి నలుగురు యువకులు సోమవారం సాయంత్రం వచ్చారు, దుకాణం నుంచి 185 క్వార్టరు మద్యం సీసాలు కొనుగోలు చేసి తరలించేదుకు టోలోకి ఎక్కించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ చలం, ఎస్‌ఐ ఎం. వినితారెడ్డి తమ సిబ్బందితో హుటాహుటిన దుకాణం వద్దకు వెళ్లారు. మద్యం సీసాలను, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం సీసాలను కొనుగోలు చేసిన నలుగురు దాసరి ఆనంద్, గుమ్మపు దుర్గాప్రసాద్, కెల్లా పాపారావు, కెల్ల జోగారావులతో పాటు వీరికి అక్రమంగా మద్యం విక్రయించిన ప్రభుత్వ మద్యం దుకాణ సేల్స్‌మ్యాన్ పుట్టా ప్రవీణ్‌లను అరెస్ట్ చేశారు.

మహనీయుల త్యాగాలు స్ఫూర్తి కావాలి


ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: అజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు, స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు ప్రకారం 'నా భూమి–నా దేశం' కార్యక్రమాన్ని సోమవారం పట్టణ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక చినరావూరులోని సత్యనారాయణ పార్కులో 'నా భూమి–నా దేశం' నేలతల్లికి నమస్కారం...వీరులకు వందనం' పేరుతో ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. అక్కడే అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులచే 'అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడంలో నా వంతు పాత్ర పోషిస్తాను' అంటూ ప్రతిజ్ఞ చేయించారు. అజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా గత ఏడాదిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను చేపట్టినట్టు ఎమ్మెల్యే శివకుమార్ గుర్తుచేశారు. ఇందుకు కృషిచేసిన అధికారులు, ప్రజాప్రతినిధులను అభినందించారు. స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొని జైలుశిక్షలు అనుభవించి, ప్రాణాలను కోల్పోయిన ఎందరో మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, స్వాతంత్య్ర విలువలను కాపాడుకుంటూ ప్రతిఒక్కరూ జీవించాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. దేశ సమగ్రత విషయంలో దేశమంతా ఒకే మాట, ఒకే బాటగా ముందుకు సాగాలని సూచించారు. ఈ స్ఫూర్తిని ముందుతరాలకు తీసుకెళ్లాలని అన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ ఛైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, మాజీ వైస్‌ఛైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, పార్టీ నేతలు దేవరపల్లి కిశోర్, షేక్ నాగూర్ బాబు, పిల్లి వీరయ్య, అక్కిదాసు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

జీజీహెచ్ నుంచి ఉత్తరప్రదేశ్‌కు మహాప్రస్థానం ద్వారా తరలింపు

గుంటూరు మెడికల్: అతను ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగి. స్వగ్రామం ఉత్తరప్రదేశ్‌లోని చికియా గ్రామం. బెంగళూరులో ఉద్యోగం చేస్తూ గర్భిణిగా ఉన్న భార్యతో రైలులో ప్రయాణిస్తుండగా తెనాలి సమీపంలో ఆమె ఆరోగ్యం విషమించడంతో అక్కడ ప్రాథమిక చికిత్స అందించి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందిన ఆమె భౌతికాయాన్ని సుమారు 1500 కిలోమీటర్లు (రానుపోనూ 3000 కి.మీ) మహాప్రస్థానం వాహనం ద్వారా గుంటూరు జీజీహెచ్ అధికారులు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్‌లోని చందోలిజిల్లా చికియాగ్రామానికి చెందిన జె.రంజిత్ కుమార్ బెంగళూరులో ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేస్తున్నాడు. అతనికి ఇరువురు సంతానం కాగా, మళ్లీ భార్య విశ్వభారతి (31) గర్భం ధరించింది. ఈనెల 13న స్వగ్రామం వెళ్లేందుకు బెంగళూరు నుంచి రైలులో కుటుంబంతో బయల్దేరారు. జిల్లాలోని తెనాలి రైల్వే స్టేషన్‌కు వారు ప్రయాణిస్తున్న రైలు చేరుకునేసరికి విశ్వభారతికి తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో ఈనెల 13వ తేదీన తక్షణమే తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి గర్భసంచి దెబ్బతిని తీవ్ర రక్తస్రావం అవుతుందని గుర్తించి, మెరుగైన చికిత్స కోసం అదేరోజు రాత్రి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్ వైద్యులు చికిత్స అందిస్తున్న సమయంలోనే తీవ్ర రక్తస్రావంతో విశ్వభారతి కోమాలోకి వెళ్లిపోయి సోమవారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆమె భౌతిక కాయాన్ని ఉత్తరప్రదేశ్‌లోని స్వగ్రామానికి చేర్చేందుకు డీఎంఈ, జిల్లా కలెక్టర్‌ల వద్ద ప్రత్యేక అనుమతి తీసుకుని మహాప్రస్థానం వాహనం ద్వారా ఉచితంగా పంపించారు. విశ్వభారతి మృతితో ఇరువురు చిన్నారులతో రంజిత్‌కుమార్ పడుతున్న అవస్థలు గమనించిన నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని చిన్నారులకు పాలు, ఆహార వసతి కల్పించి మానవత్వాన్ని చాటుకున్నారు.